అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలి

- ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర • అధికారులతో సమీక్ష

ములుగురూరల్, ఫిబ్రవరి 20 : జిల్లాలో వేసవి దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్ దివాకర అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి మాట్లాడారు. తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరాను నిరంతరం కొనసాగించాలని సూచించారు. పైప్‌లైన్లు, బోర్ల పనితీరును పరిశీలించి లీకేజీలు లేకుండా చూడాలని అన్నారు. ప్రతి గ్రామంలో నీటి వనరుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య ఉంటే గంట వ్యవధిలోనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. నీటి సమస్య ఏర్పడినప్పుడు ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా జీపీకి చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, ఈఈ సుభాష్, డీపీవో దేవరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

వెంకటాపూర్ : విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని కలెక్టర్ టీఎస్ దివాకర ఆదేశించారు. గురువారం మండలంలోని రామంజాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా..?లేదా..? బోధిస్తున్న విద్య తీరును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. డైనింగ్ హాల్, పడక గదులు, పరిసరాలు, స్టోర్స్, వంట గదులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుడూ పిల్లలకు స్వచ్ఛమైన, రుచికరమైన తాగునీరు, ఆహారం అందించాలని అన్నారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, మానసిక వికాసం కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించి వారిని గమనిస్తూ అవగాహన కల్పించాలన్నారు. షెడ్యూల్ ప్రకారం వారికి వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ఆదివారం అందించే భోజనం ఫొటోలు గూగుల్ సీట్‌లో పంపాలని అదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజు పాల్గొన్నారు.

హత్యను రాజకీయం చేయడం సరికాదు

- మాజీ ఎమ్మెల్యే గండ్రపై మంత్రి కోమటిరెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం
- గండ్ర యువసేన జిల్లా అధ్యక్షుడు పోరెడ్డి పూర్ణచంద్రారెడ్డి

పూర్ణచంద్రారెడ్డి

గణపురం, ఫిబ్రవరి 20 : భూపాలపల్లిలో బుధవారం జరిగిన రాజలింగమూర్తి హత్య విషయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను గండ్ర యువసేన జిల్లా అధ్యక్షుడు, గణపురం సొసైటీ మాజీ చైర్మన్ పోరెడ్డి పూర్ణవంద్రారెడ్డి తీవ్రంగా ఖండించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజలింగమూర్తి హత్య విషయంలో రాజకీయం చేయడం మంచిది కాదన్నారు. ఆయన హత్యకు భూ వివాదాలే కారణమని స్థానిక ప్రజలు, పోలీసులు చెబుతున్నప్పటికీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు నేతలు కావాలని మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అనవసర ఆరోపణలు చేయడం సరికాదని అన్నారు. మీ పార్టీలో అంతర్గత స్వేచ్ఛ కోసం కొట్లాడుకునే మీరు ప్రజలను పక్కదారి పట్టించేందుకు చిల్లర మాటలు మాట్లాడుతున్నారన్నారు. మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై మరోసారి నిరాధార ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. ఎవరి చరిత్ర ఏమిటో ప్రజలకు తెలుసని అన్నారు. ప్రభుత్వం మీదే అని, దమ్ముంటే సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ చేపట్టి నిజమైన దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీపై అసత్యపు ఆరోపణలు చేయడం మానుకొని, ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని కోరారు.

శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించాలి

భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 20 : భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 30వార్డుల్లో శానిటేషన్ పనులు పకడ్బందీగా నిర్వహించాలని భూపాలపల్లి మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 8, 10 వార్డులైనా జవహర్‌నగర్‌కాలనీ, పుల్లూరు రామయ్యపల్లి కాలనీల్లో నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ కాలనీలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఒకవేళ వార్డులలో చెత్త సేకరణ పనులు, డ్రైనేజ్ క్లీనింగ్‌కు రాకుంటే వెంటనే తమకు తెలియజేయాలని కాలనీ ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ జీ నవీన్‌కుమార్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ ఎం దేవేందర్, మున్సిపల్ జవాన్‌లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై పటిష్ట నిఘా

- అడ్డుకునేందుకు చర్యలు
- మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్
- ఇసుక క్వారీల్లో ఆకస్మిక తనిఖీ

ఇసుక క్వారీలో తనిఖీ చేస్తున్న మైనింగ్‌శాఖ పీఎస్ ఎన్ శ్రీధర్, కలెక్టర్ రాహుల్‌శర్మ

మహదేవపూర్(కాళేశ్వరం), ఫిబ్రవరి 20 : ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పటిష్ట నిఘా కొనసాగాలని మైనింగ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని బొమ్మాపూర్, ఎల్కేశ్వరం, అన్నారం, పలుగుల, పూసుకుపల్లి, మద్దులపల్లిలో ఇసుక రీచ్‌లను కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా ఏరియాల్లో ఇసుక స్టాకు, గోదావరిలో ఇసుక తీసే విధానాన్ని పరిశీలించారు. రోజువారీగా ఎన్ని టన్నుల ఇసుక రవాణా జరుగుతున్నదని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీచ్‌లలో ఇసుక తీసే కార్యకలాపాలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక కోసం ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చామన్నారు. ఈ సేవల ద్వారా ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా ఇసుక లభించేందుకు వీలు కలుగుతుందని తెలిపారు ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక అందుబాటులో ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. స్టాకు పాయింట్, రీచ్‌లకు వచ్చే వాహనాలు, లోడింగ్‌తో వెళ్లే మార్గాల్లో పటిష్ట పర్యవేక్షణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రోజు వారీగా 8నుంచి 10వేల మెట్రిక్ టన్నులకు ఇసుక రవాణాను పెంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు, ప్రజలకు ఇబ్బంది కలుగకుండా ఇసుక స్టాక్ ఏర్పాటుకు అలాగే వాహనాలు నిలిపేందుకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఇసుక కొరత రాకుండా స్టాక్ నిల్వలు పెంచి ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. గోదావరి నుంచి ఇసుక తీయటానికి యంత్రాలను పెంచాలని సూచించారు. ఇసుక రవాణాకు నిర్దేశించిన మేరకు అదనంగా 3గంటలు కేటాయిస్తామని, నిర్దేశించిన లక్ష్యం మేర ఇసుక రవాణా చేయాలని ఆయన ఆదేశించారు. నిర్దేశించిన స్టాకు ప్రకారం ఇసుక తరలించేందుకు వాహనాలకు అనుమతి ఇవ్వాలని తెలిపారు. కాంట్రాక్టర్‌కు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లిస్తామని, ఇసుక తీయడానికి అదనపు యంత్రాలు ఏర్పాటు చేసి ఇసుక నిల్వలు పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్లను ఆదేశించారు. లారీలు కాం టా వేసేందుకు అదనపు వేయింగ్ మిషన్ ఏర్పాటు చేయాల్సి ఉన్నదని, ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ వేయింగ్ మిషన్‌ను వినియోగించుకోవాలని ఆయన సూచించా రు. అనంతరం కలెక్టర్ రాహుల్‌శర్మ మా ట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. వాహనాల రద్దీని నియంత్రించేందుకు ఆ న్‌లైన బుకింగ్ ప్రకారం క్రమపద్ధతిలో వా హనాలు రీచ్‌కు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చెకింగ్ పాయింట్ ఏర్పాటు ద్వారా నిశిత పరిశీలన జరుగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీజీ ఎంఐడీసీ వీసీ అండ్ ఎండీ సుశీల్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, టీఎస్ఎం ఐడీసీ పీవో రం గారెడ్డి, మైనింగ్ ఏడీ జయరాజు, తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణ, అయా శాఖల అధికారులు, సీఐ రామచంద్రరావు, ఎస్సైలు పవన్‌కుమార్, తమాషారెడ్డి, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రామప్పలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్

రామప్పలో ఏర్పాట్లు పరిశీలించిన డీఎస్పీ

వెంకటాపూర్, ఫిబ్రవరి 20 : మండలంలోని పాలంపేట గ్రామంలోని రామప్ప దేవాలయంలో ఈ నెల 26వ తేదీన జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భద్రత ఏర్పాట్లను గురువారం డీఎస్పీ రవీందర్ పరిశీలించారు. పార్కింగ్ క్యూలైన్, కల్యాణం జరిగే, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే ప్రాంతాలను, రామప్ప చెరువును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా ఇద్దరు డీఎస్పీలు, 8మంది సీఐలు, 12మంది ఎస్సైలు, మొత్తం 300మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీఐ శంకర్, ఎస్సై సతీశ్, దేవాదాయ, పురావస్తు, టూరిజం శాఖల సిబ్బంది ఉన్నారు.

అగ్రకులాల కుట్రలకు బహుజనులు బలి కావొద్దు

టేకుమట్ల, ఫిబ్రవరి 20 : బహుజనులను రాజకీయంగా అణగదొక్కేందుకే అగ్రకులాల రాజకీయ నాయకులు బహుజనుల మధ్య కొట్లాటలు పెట్టి ఓట్లను కొల్లగొట్టి అధికారమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని, అలాంటి కుట్రలకు బహుజనులు బలికావద్దని బహుజన సమాజ్ పార్టీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతిగౌడ్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అగ్రవర్ణ నాయకులు మండలంలోని బహుజనుల మధ్య కొట్లాట పెట్టి, ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకునేలా రెచ్చగొట్టి విడిపోయే పరిస్థితి తీసుకొచ్చారని, వాళ్లు మాత్రం సంతోషంగా ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బహుజనులు ఏకమై వ్యక్తిగత విమర్శలు చేసుకోకుండా, అగ్రవర్ణ రాజకీయ నాయకుల తప్పిదాలను ఎండగట్టాలి తప్ప, విడిపోయి ఆగం కావద్దని సూచించారు.

నేడు డయల్ యువర్ డీఎం

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 20 : భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో నేడు (శుక్రవారం) ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నామని డీఎం హిందూ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి డిపో పరిధిలోని ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు 99592 26707కు డయల్ చేసి భూపాలపల్లి ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు అందజేయాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయలక్ష్మి

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 20 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. ఇంటర్మీడియట్ పరీక్ష నిర్వహణపై గురువారం తన ఛాంబర్‌లో జిల్లా ఇంటర్మీడియట్, పోలీస్, ఆర్టీసీ, విద్యుత్, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్, పోస్టల్‌శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొదటి, రెండో సంవత్సరం ఇంటర్ విద్యార్థులకు 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రథమ సంవత్సరంలో 1,820మంది, ద్వితీయ సంవత్సరంలో1,795 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఫ్లైయింగ్ స్క్వాడ్ ఒకటి, సిట్టింగ్ స్క్వాడ్ 2, జిల్లా పరీక్షల కమిటీ ఒకటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల్లో నిరంతరాయ విద్యుత్ సరఫరా, సురక్షిత మంచినీరు, అత్యవసర వైద్య చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్ విధించాలని సూచించారు. సమీపంలోని జిరాక్స్ కేంద్రాలు మూసి వేయాలన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా. పరీక్ష రా యడానికి అనువైన వాతావరణంతోపాటు బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడానికి వీలుగా అదనపు బస్సులు ఏర్పాటుచేయాలని సూచించారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారి వెంకన్న, విద్యుత్‌శాఖ ఎస్ఈ మల్ఛూర్‌నాయక్, ఆర్టీసీ డీఎం ఇందు, డీఎస్పీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వైద్య ఆరోగ్యశాఖ నుంచి డా శ్రీదేవి పాల్గొన్నారు.

విలువలతో కూడిన రాజకీయం చేయాలి

బీఆర్ఎస్ యూత్ నాయకుడు అక్రమ్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ యూత్ నాయకులు

టేకుమట్ల, ఫిబ్రవరి20 : అధికార పార్టీలో ఉండి ప్రతిపక్షాలకు ఓపికగా సమాధానం చెబుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేయాలి తప్ప వ్యక్తిగత విమర్శలు చేయడం పద్ధతి కాదని బీఆర్ఎస్ మండల యూత్ నాయకుడు అక్రం కాంగ్రెస్ నాయకులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి పక్ష హోదాలో ప్రజా సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులను అధికార పక్షంలో ఉన్న ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుండా వ్యక్తిగతంగా విమర్శించి ప్రజల్లో చులకన కావద్దని హితువుపలికారు. కాంగ్రెస్ నాయకులు వ్యక్తిగత విమర్శలు మాని ప్రజాసమస్యలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో యూత్ నాయకులు రెడ్డిరాజుల రాజు, బోండ్ల ప్రభాకర్, బండెల శ్రావన్, గొల్లపల్లి జగదీశ్, సట్ల శ్రీధర్, శ్రీపతి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయంపై అవగాహన

గోవిందరావుపేట, ఫిబ్రవరి : మండలంలోని చల్వాయి గ్రామంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో యువతరం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్రం వారి సహకారంతో అంతర్జాతీయ సామాజిక న్యాయం అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా బాలల పరిరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ డీ సంజీవ హాజరై మాట్లాడారు. విద్యా హక్కు చట్టం, బాల్య వివాహ నిరోధక చట్టాలు, బాల కార్మిక, ఆస్తి హక్కు, ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. యువతరం యూత్ ప్రతినిధి బండా రి అనీల్‌కుమార్, కళాశాల స్పెషల్ ఆఫీసర్ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు మృతి

మంగపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని బోరునర్సాపురం శివారులో ఈనెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుండారపు శివ(17) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. కొత్తపేటకు చెందిన గుండారపు శివ, బంటు భానుచరణ్, పొదుమూరుకు చెందిన వారి స్నేహితుడు బేత సాయికుమార్ కలిసి బైక్‌పై వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఈ ముగ్గురికి కాళ్లు విరిగాయి. వీరిలో శివకు కుడి కాలు విరగడంతోపాటు తల వెనుకవైపు తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురిని వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించారు. విషమంగా ఉన్న శివను ఎంజీఎం నుంచి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే శివ మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు. శివ మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. కాగా శివ తల్లిదండ్రులు గుండారపు నర్సింహారావు-సామ్రాజ్యం కూలీ పనులు చేసుకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. చేతికొచ్చిన పెద్ద కుమారుడు శివ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

తాడ్వాయి, ఫిబ్రవరి 20 : గుర్తు తెలియని వృద్ధురాలు(75) గురువారం మృతి చెందినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. మండలకేంద్రంలో రోడ్డు పక్కన అనారోగ్యంతో రెండు నెలల క్రితం పడిఉండగా చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ సదరు వృద్ధురాలు మృతి చెందిందని తెలిపారు. వివరాలు తెలిస్తే 8712670088ను సంప్రదించాలని సూచించారు.

విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు

కృష్ణ కాలనీ, ఫిబ్రవరి 20 : వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ రోజురోజుకూ పెరుగుతున్న క్రమంలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టామని భూపాలపల్లి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ మల్యూరు నాయక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని సంఘమిత్ర కళాశాల ముందు నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయ ప్రారంభించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కొత్తగా ట్రాన్స్‌ఫార్మర్లు 46 ఏర్పాటు చేశామని, అలాగే 15ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం కూడా పెంచినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈ పాపిరెడ్డి, ఏఈ విశ్వాస్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు, రేపు టాలెంట్ టెస్ట్

కాటారం, ఫిబ్రవరి 20 : భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో నేడు, రేపు(21,22 తేదీల్లో) పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించనున్నారు. బోర్డ్ పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించడం కోసం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్, మండల అధ్యక్షుడు సాగర్ గురువారం తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 20 : మీ సేవా కేంద్రాల సేవలకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుము కంటే అదనంగా ప్రజల నుంచి వసూల చేస్తే కఠిన చర్యలు తప్పవని ఈడీఎం శ్రీకాంత్ హెచ్చరించారు. గురువారం మండలంలోని మీ సేవా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. నిర్వాహకులు ప్రభుత్వ సేవలను నిరంతరాయంగా అందించాలన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

కాటారం, ఫిబ్రవరి 20 : 353(సీ) జాతీయ రహదారిపై కమలాపూర్ క్రాస్ సమీపంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో కాటారం గ్రామానికి చెందిన బెడికె బుచ్చిమల్లు, బెడికె మల్లయ్యతోపాటు మరో మహిళ గాయపడింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి నుంచి గోదావరిఖని ఆర్టీసీ డిపో బస్సు కాటారం వైపు వెళ్తుండగా మహదేవపూర్ నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న లారీ పక్కనుంచి తాక్కుంటూ వెళ్లింది. దీంతో సీట్లో కూర్చున్న బుచ్చిమల్లు, మల్లయ్యతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని భూపాలపల్లి 100పడకల ఆస్పత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కంటి శస్త్ర చికిత్సకు 40 మంది ఎంపిక

ఏటూరునాగారం, ఫిబ్రవరి 20 : మండల కేంద్రంలోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో సాయిబాబా దేవాలయం కమిటీ, హైదరాబాద్‌లోని శంకర్ కంటివైద్యశాల, రాహుల్ ఐ కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 120మంది వృద్ధులు హాజరు కాగా, వారిలో 40మందిని శస్త్ర చికిత్స కోసం ఎంపిక చేసినట్లు సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్ తెలిపారు. వీరికి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులో పంపించి శస్త్ర చికిత్స చేయించనున్నట్లు తెలిపారు. కంటి పరీక్షలకు హాజరైన వారికి చందర్‌రావు భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది, ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 20 : మండలకేంద్రం, గూర్లేవులలో గురువారం ఎన్‌సీడీ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యుడు అభినవ్ తెలిపారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ 30ఏళ్ల పైబడిన వారికి బీపీ, షుగర్, నోటి క్యాన్సర్ పరీక్షలు చేసినట్లు తెలిపారు. కొత్తగా గుర్తించిన రోగులను స్థానిక పీఎచ్‌సీలో నమోదు చేయించి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం కవిత, ఏఆర్‌బీ కోఆర్డినేటర్ రవీశ్ పాల్గొన్నారు.

ఘనంగా బాలకుమారస్వామి మినీ జాతర

ములుగురూరల్, ఫిబ్రవరి 20 : ములుగు మండలంలోని అంకన్నగూడెం గ్రామంలో గురువారం బాలకుమారస్వామి మినీ జాతరను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. భక్తులు హుజరై మొక్కులు చెల్లించారు. పూజారులు కొట్టం నారాయణ, బాలరయ్య, సాంబయ్యలు దేవుని ఆశీర్వచనాలను భక్తులకు అందించారు.

ఘనంగా అమ్మవార్ల జాతర

వెంకటాపురం(నూగూరు) : బీసీ మర్రిగూడెంలో గురువారం సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా జరిగింది. జాతర సందర్భంగా ఆలయం వద్ద అమ్మవార్లకు భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బుట్టాయిగూడెంలో సమ్మక్క సారలమ్మ జాతర

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 20 : మండలంలోని బుట్టాయిగూడెంలో సమ్మక్క సారలమ్మ జాతర ఘనంగా జరుగుతోంది. గురువారం గ్రామంలో ఊరేగింపుగా సమ్మక్క దేవతను తీసుకొచ్చి గుడిలో ప్రతిష్ఠించడంతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క, సారలమ్మల పూజారులు పొడెం రామలక్ష్మి, కోరం లక్ష్మీనర్సు, వడ్డెలు నల్లె బోయిన వంశస్తులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

ఏటూరునాగారం, ఫిబ్రవరి 20 : బీసీ సంక్షేమ సంఘం మండల కమిటీ అధ్యక్షుడిగా రాంనగర్ గ్రామానికి చెందిన గడబోయిన శ్రీకాంత్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు పత్తిపాక రాము తెలిపారు. ఈ మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా వంగపండ్ల రవి, ప్రధాన కార్యదర్శిగా అల్లంల చంటియాదవ్, కోశాధికారిగా గార నరేందర్, ప్రచార కార్యదర్శిగా వడకాపురం సారయ్య, గౌరవ సలహాదారుడుగా తీగల సమ్మయ్య, కమిటీ సభ్యులుగా అంతటి నాగరాజు, ఏనుగుల మహేశ్, శ్రీరాం రమేశ్‌ను నియమించారు.

డిజిటల్ అరెస్టుపై అవగాహన

ములుగురూరల్, ఫిబ్రవరి 20 : ములుగు జిల్లా కేంద్రంలోని ఎస్బీఐ బ్యాంకు వద్ద డిజిటల్ అరెస్టుపై సెయింట్ ఆంథోనీస్ పాఠశాల విద్యార్థులకు ఖాతాదారులకు అవగాహన కల్పించారు. పరిచయం లేని వ్యక్తులు ఫోన్ చేస్తే ఓటీపీలు, ఖాతా వివరాలు పంపించవద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ యారవ కవితారెడ్డి, హెచ్ఎం కందాల రమేశ్, డైరెక్టర్లు సానికొమ్ము వెంకటప్పారెడ్డి, బొల్లం రవి, ఏళ్ల మధుసూదన్, బ్యాంకు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎంకు వీడ్కోలు

ఏటూ